క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



దిగువచింతలకొండలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

తుగ్గలి: ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు అన్నారు. దిగువ చింతలకొండలో గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి, మండల నిధులు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కృషితో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సీసీరోడ్డు పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుచున్న వర్షిత అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఆనంద్‌రావు గురువారం తెలిపారు. ఈనెల 2వ తేదీన కర్నూలులో జరిగిన ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్‌లో విద్యార్థిని ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈ నెల 7వ తేదీన వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జరిగే పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా వర్షితను ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, పీఎంసీ చైర్మన్ గోవర్ధన, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి కె.వినోద్ కుమార్ గౌడ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు.శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్ఎం చిత్రలేఖ తెలిపారు.

వంట పాత్రలు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

వెల్దుర్తి: మండలంలోని అన్ని పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లు, వంట పాత్రల పంపిణీ గురువారం ప్రారంభమైంది. ప్రభుత్వం 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెరిగేలా 24 రకాల క్రీడా సామగ్రి, మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట పాత్రలను ఎంపీపీ, ఎంపీయూపీ, ఉన్నత పాఠశాలలకు అనువైన రకాలుగా అందిస్తోంది. ఈ మేరకు హెచ్ఎంలు ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్న సామగ్రిని తమ పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. స్థానిక ఎంపీపీ స్కూల్‌లో హెచ్ఎం జి.సరస్వతి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంట సామగ్రి అందించారు. అలాగే విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందించి ప్రోత్సహించారు.

వైభవంగా దశమి ఉత్సవాలు



స్వామివారి పల్లకోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన ఆది చింతలాముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల సందర్భంగా గురువారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం దేవాలయంలో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళ హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు తెల్లవారుజామున స్వామి వారి ఆశ్వాన్ని చింతలాముని, నల్లారెడ్డి స్వామి దేవాలయం నుంచి ఓబులేషు దేవాలయం వరకు అశేష భక్తుల జనుల హర్షధ్వనుల మధ్య ఊరేగించారు. భక్తులు అడుగడుగునా పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. స్వామి వారి పల్లకీ మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి రహదారి

తుగ్గలి: పల్లె పురోగతిలో రోడ్ల పాత్ర కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అందులో భాగంగా రాతన నుంచి రాతన కొత్తూరుకు తారు రోడ్డు నిర్మాణమవుతోంది. ఏపీ రూరల్ రోడ్ కనెక్టివిటీ పథకం కింద రాతన నుంచి ఆర్ కొత్తూరు వరకు 3.6 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.3.12 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన పనులను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు సింగిల్ విండో మాజీ డైరెక్టర్ విజయ మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..ఆర్ కొత్తూరుకు తారురోడ్డు నిర్మాణంతో దశాబ్దాల కల నేరవేరిందన్నారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీదేవికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప బాలికలఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయిలో శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు బరోడాలోని గుజరాత్ పబ్లిక్ స్కూల్‌లో జరిగే రోలర్ స్కేటింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలులో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన గీత, వైశాలి, గీతమ్మ, భావన చౌదరి, దీపిక, ధరణి, రితిక సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పీడీలు నాగేశ్వరి, సుజనకుమారి తెలిపారు. క్రీడాకారిణులను ప్రత్యేకంగా అభినందించారు.







మల్లెపల్లెలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం, టి.సోమలగూడూరులో వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలు, హెచ్.కైరవాడిలో శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారి నూకరాజు, టి.గోకులపాడులో శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య, గూళ్యంలో వైద్య శిబిరం

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం



ఎమ్మిగనూరు శిబిరంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు



పెండేకల్లులో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పెండేకల్లులో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సింగిల్‌విండో అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి, సర్పంచ్ లీలావతి, ఎంపీటీసీ సభ్యుడు రంగన్నతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒక వైద్యుడు ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో వైఎస్సార్ పాలన ద్వారా చూశామన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎంగా తండ్రికి మించిన పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే ఆలోచన ఏనాడైనా వచ్చిందా అని ప్రశ్నించారు. టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వైఎస్ జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గ్రామంలో రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన నాగభూషణం రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎంపీడీఓ సావిత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సంజీవనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని లక్ష్మీపేట సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. మున్సిపల్ డీఈ నీరజ, వార్డు ఇన్‌చార్జ్ వడ్డె వీరేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బంది వైద్య సేవలందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పోషకాహార స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

గోనెగండ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా అధికారి, జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషల్ ఆఫీసర్ నూకరాజు సూచించారు. గురువారం హెచ్.కై రవాడిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. శిబిరంలో డాక్టర్లు సింధూర, గోపిచంద్, అపర్ణ, కార్తిక్ దాదాపు 400 మంది గ్రామస్తులకు ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన హెల్త్ క్యాంప్ విజయవంతమైంది. మల్లెపల్లె, అల్లుగుండు గ్రామాలకు చెందిన 250 మంది ఆరోగ్య సేవలు వినియోగించుకున్నట్లు ఎంపీహెచ్ఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. వైద్యాధికారులు రఘు, శైలేష్ కుమార్, నీలోఫర్ సీమ, కె.అమర్‌నాథ్ రెడ్డి, కవిత వైద్య సేవలందించారు. పలువురికి కంటి అద్దాలు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డులు, అంగన్‌వాడీ బాలామృతం ప్యాకెట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు, డాక్టర్లు అందించారు. శుక్రవారం బింగిదొడ్డిలో హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

నందవరం: మండల పరిధిలోని టి.సోమలగూడూరులో గ్రామస్తులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరాన్ని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య పర్యవేక్షించారు. సీహెచ్‌సీ డాక్టర్లు పరిమళ, విజయ భారతి, చంద్రకాంత్ యాదవ్, శృతి, రామచంద్రుడు వైద్య సేవలందించారు. గ్రామంలో 538 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

హాలహర్వి: మండలంలోని గూళ్యం సచివాలయం-3 పరిధిలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి చేరుకుని వైద్య చికిత్సలు పొందారు. వైద్యులు మన్సూర్‌వలీ, తిమ్మన్న, గంగాధర్, ప్రణీత్ రోగులను పరీక్షించి ఉచితంగా కంటి అద్దాలు, మందులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీడీఓ ఆంతోని, డిటీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కురువ పక్కిరమ్మ, సర్పంచ్ ఉలిగమ్మ పరిశీలించారు.



అలారుదిన్నెలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ములుగుందంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

కృష్ణగిరి: మండలంలోని టి.గోకులపాడు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యురాలు రామేశ్వరమ్మ, ఎంపీడీఓ విశ్వమోహన్ ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామగిడ్డయ్య పరిశీలించారు. శిబిరానికి వచ్చే వారికి ఏలాంటి ఆసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. శిబిరంలో 227 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు.

రూపాయి ఖర్చు లేకుండా వైద్యం



రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే వైద్యులు వచ్చి ఉచితంగా సేవలు అందించడం మాలాంటి పేదలకు వరం లాంటిది. యాంత్రిక జీవితంలో సొంత కుటుంబ సభ్యులే వృద్ధులను పట్టించుకోవడం లేదు. సీఎం వైఎస్ జగన్ వృద్ధులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. నేను గత కొంత కాలంగా బీపీ, షుగర్‌తోపాటు గుండెజబ్బుతో బాధపడుతున్నా. గతంలో కర్నూలుకు వెళ్లి ప్రయాసలు పడుతూ డాక్టర్లకు చూపించుకునేవాళ్లం. ఇప్పుడు మా గ్రామానికే స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి వైద్యసేవలు అందించడం ఆనందంగా ఉంది.

– కాల్వ చిన్న గిడ్డయ్య, టి.గోకులపాడు

పరీక్షలు చేసి మందులు ఇచ్చారు



నాకు నడిచేందుకు చేత కావడం లేదు. కాళ్ల నొప్పులు విపరీతంగా ఉన్నాయి. నా పరిస్థితి తెలుసుకుని వలంటీర్లే వీల్ చైర్‌లో శిబిరం వద్దకు తీసుకొచ్చి డాక్టర్లకు చూపించి పరీక్షలు చేయించి ఉచితంగా మందులు ఇప్పించారు. మంచి వైద్యం అందించారు.

– మస్తాన్, ఎమ్మిగనూరు పట్టణం

దేవనకొండ: మండలంలోని అలారుదిన్నె గ్రామంలో చేపట్టిన వైద్య శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. వైద్యులు కళ్యాణ్, హత్వాల్లా, చంద్రశేఖర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు ఎంపీడీఓ ఇద్రూష్‌బాషా,సీహెచ్ఓ భాగ్యలక్ష్మి,సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో నిర్వహించిన శిబిరంలో 250 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. డాక్టర్లు కల్పన, బాలకృష్ణారెడ్డి, బాలగంగాధర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక 29వ వార్డు పరిధిలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, రూ.24లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమీషనర్ గంగిరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే ప్రతి వార్డు పరిధిలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు మంచినీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్దిష్ట ప్రణాళికతో వార్డు కౌన్సిలర్ల సూచనల మేరకు అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో పనులన్నీ పూర్తి చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ ఏఈ శరత్‌కుమార్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు 29వ వార్డులో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

వైఎస్సార్‌సీపీతోనే సుపరిపాలన

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనతో ప్రతి ఇంటికి సంక్షేమం దరిచేరిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గురువారం మండలంలోని రాయచోటి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాయకులు శివారెడ్డిగౌడ్, విరుపాక్షిరెడ్డి, సర్పంచ్ వీరస్వామి, ఎంపీడీఓ దశరథరామయ్య, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ



భానుచంద్రకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లతీష్‌కుమార్

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామానికి చెందిన భానుచంద్ర అనే దివ్యాంగుడి కోసం చిత్తూరుకు వెళ్లి పింఛన్ అందించి వలంటీర్ లతీష్‌కుమార్ ప్రశంసలు పొందారు. భానుచంద్ర గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 20 రోజుల క్రితం కుటుంబసభ్యులు తమిళనాడులోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. డిశ్చార్జ్ అయిన తరువాత చిత్తూరులో ఉంటున్న సోదరుడి గదిలో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. భానుచంద్ర రాలేడనే విషయం తెలుసుకున్న వలంటీర్ లతీష్‌కుమార్ గురువారం చిత్తూరుకు వెళ్లి పరామర్శించి దివ్యాంగ పింఛన్ రూ.3 వేలు అందజేశాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ వల్లనే చిత్తూరులో ఉన్నా తనకు పింఛన్ అందిందని, ఈ సొమ్ము వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుందని భానుచంద్ర కృతజ్ఞతలు తెలిపాడు.

నూతన వంగడాలపై మొగ్గు చూపాలి



రామళ్లకోటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించిన ఏడీఏ, ఏఓలు

వెల్దుర్తి: పాత రకాలకు స్వస్తి పలికి, అధిక దిగుబడులనిచ్చే నూతన వంగడాలపై రైతులు మొగ్గు చూపాలని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ సూచించారు. గురువారం ఆయన స్థానిక ఏఓ అక్బర్‌బాషాతో కలిసి రామళ్లకోటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించి టీసీజీసీ 1694, కదిరి 6 రకాల నూతన వేరుశనగ వంగడాలతో సాగు చేసిన పొలాలను పరిశీలించారు. ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. దిగుబడి పెరిగేలా వేరుశనగ పూత దశలో జిప్సం వాడాలని సూచించారు. అనంతరం గ్రామ ఆర్బీకేలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ, ఏఓ, సర్పంచ్ నిర్మల గ్రామంలో బోరుబావుల కింద సాగు చేపట్టనున్న రైతులకు ప్రయోగాత్మకంగా ఒక్కొక్కరికి అర ఎకరానికి సరిపడా లేపాక్షి 1812 రకం వేరుశనగ నూతన వంగడాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్బీకే సిబ్బంది సాంబశివుడు, రైతులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పెండ్లిమాన్‌తండా గ్రామంలోని నాటుసారా స్థావరాలపై గురువారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, టౌన్ సీఐ మురళీమోహన్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం ఊట, 40 లీటర్ల నాటుసారా, రికార్డులు లేని ఏడు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. దాడుల్లో తుగ్గలి, పత్తికొండ, మద్దికెర, జొన్నగిరి ఎస్ఐలు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ తండాలో సుగాలి రంగస్వామి నాయక్, సుగాలి దాసు నాయక్‌ల నుంచి 15 లీటర్ల నాటుసారా, గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వడ్డె మద్దిలేటి నుంచి 27 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం తాము కోడుమూరు సెబ్ బృందంతో కలిసి ఆయా గ్రామాలలో జరిపిన దాడులలో పట్టుబడ్డ నిందితులపై కేసులు నమోదు చేసి, డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

సమస్య పరిష్కరించండి



స్టేషన్‌మాస్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్‌కుమార్

మద్దికెర: రైల్వే బ్రిడ్జిల వల్ల రైతులకు ఏర్పడే సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. గురువారం మద్దికెరలోని నల్లరేగడి పొలాలకు వెళ్లే మార్గంలో వెళ్లే రైల్వే బ్రిడ్జిలను పరిశీలించారు. అనంతరం స్టేషన్ మాస్టర్‌తో మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. రైతులు మాట్లాడుతూ.. వానలు వస్తే బ్రిడ్జి అవతలి పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పవని, గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జిల విషయం సంబంధిత డీఆర్ఎంతో కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి సీసీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

విడపనకల్లు: మండలంలోని వి.కొత్తకోటలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వి.కొత్తకోటకు చెందిన గొల్ల చిన్న భీమన్న, గాదిలింగమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరు ముగ్గురూ చెవిటి, మూగతో బాధపడుతున్నారు. ఈ లోపం కారణంగా ఇతరులతో కలవకుండా ముక్తసరిగా ఉండేవారు. రెండేళ్ల క్రితం రెండో కుమార్తె రంగమ్మకు కర్నూలు జిల్లా ఆలూరు మండలం మనేకుర్తికి చెందిన గొల్ల రమేష్ (26)తో వివాహమైంది. పెళ్లి తర్వాత ఇంటి బాధ్యతలు చూసుకుంటూ రమేష్ వి.కొత్తకోటలోనే స్థిరపడ్డాడు. ఈ స్థితిలో బుధవారం రాత్రి తమ పొలంలోనే చెట్టుకు డ్రిప్ వైర్‌తో ఉరి వేసుకుని మృతి చెందాడు. రమేష్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివాముకు నిప్పు

వెల్దుర్తి: గువ్వలకుంట్ల గ్రామంలో గురువారం మధ్యాహ్నం రాజుకు చెందిన గడ్డివాము మంటల్లో దగ్ధమైంది. గ్రామ సమీప కళ్లందొడ్డిలో మంటలను గుర్తించిన స్థానికులు, యజమాని కుటుంబీకులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న డోన్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ రంగస్వామి గౌడ్ బృందం ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.80వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. పాత కక్షలతో తన గడ్డివాముకు నిప్పు పెట్టారని బాధితుడు అనుమానితులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారిస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పాడి అభివృద్ధికి ప్రోత్సాహం

వెల్దుర్తి: ఏపీ పశుసంవర్ధక శాఖ ద్వారా జాతీయ లైవ్ స్టాక్ మిషన్ నిధులతో పాడి రైతులు, నిరుద్యోగులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పుల్లగుమ్మి పశు వైద్యాధికారి స్వాతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ..వివిధ రకాల యూనిట్లకు 50 శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకానికి వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల సబ్సిడీ మంజూరు చేయనుందన్నారు. అలాగే కోళ్లు, పందుల పెంపకానికి సబ్సిడీ అందిస్తున్నట్లు చెప్పారు. అనుభవం గల పశు పోషకులు, స్వయం సహాయక సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనిట్ల ఏర్పాటు, సబ్సిడీ తదితర వివరాలకు ఈ నెల 7న కర్నూలులోని పెద్దపాడు రోడ్డులో గల పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



మంత్రి గుమ్మనూరు జయరాంకు సమస్యలను వివరిస్తున్న ప్రజలు

ఆలూరు: గ్రామ సచివాలయ సిబ్బంది, మండల స్థాయి ఉద్యోగులు ప్రజా సమస్యలను పరిష్కరించకపోవడం వల్లే ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తున్నారని మంత్రి గుమ్మనూరు జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి నివాస క్యాంపు కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాల ప్రజలు తాగునీరు, సీసీ రోడ్లు, ఫించన్లు, సర్వే పనులు, పట్టాదారు పాసు పుస్తకాలు, వైఎస్సార్ జలకళ బోర్లకు క్లియరెన్స్ సర్టిఫికెట్ల మంజూరు ఈసీ, ఉపాధి హామీ పథకం తదితర సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. బాధ్యతగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



వృషభాల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: రైతుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి సందర్భంగా ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలను గురువారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ, ట్రాక్టర్ యూనియన్ నాయకులు శాలువా, గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. రైతు సంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. గాజులదిన్నె ప్రాజెక్టు అభివృద్ధికి రూ.57.34 కోట్లు నిధులు మంజూరు చేశారని వివరించారు. మూడు నెలల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఎంపీపీ టీ.నసురుద్దీన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, సింగిల్‌విండో అధ్యక్ష, ఉపాధ్యక్షులు తిరుమల రెడ్డి, భాస్కర్ రెడ్డి, మండల కన్వీనర్ దొరబాబు పాల్గొన్నారు.

శ్రీమఠంలో ఎమ్మెల్యే పూజలు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి గురువారం సాయంత్రం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వదించారు.

జనరంజకంగా జగనన్న పాలన



ఎల్లార్తిలో మాట్లాడుతున్న జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి

హొళగుంద: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి జనరంజక పాలన అందిస్తున్నారని జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఎల్లార్తి గ్రామానికి వచ్చిన ఆయన షేక్షావలి, షాషావలి దర్గాలను దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల ఇంటి వద్దకే పాలనను అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చి సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ సువర్ణ పాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజల సొమ్మును దోచుకున్నాడని దుయ్యబట్టారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు నేడు జైలు పాలయ్యాడని చెప్పారు. ప్రజలు నాటి టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించాలన్నారు. అనంతరం గ్రామంలో జేసీఎస్ గృహ సారథి కురువ శివశంకర్ (40) అనారోగ్యంతో మృతి చెందాడనే విషయం తెలుసుకున్న సురేందర్ రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చిలుక శ్రీరాములు(ఫైల్)

హొళగుంద: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న చిలుక శ్రీరాములు (46) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీరాములు గతంలో విద్యుత్ శాఖకు సంబంధించి కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ, మోటారు వైండింగ్ షాపు నిర్వహించేవాడు. అప్పులు పెరగడం, తాగుడుకు బానిసగా మారి తరుచూ భార్య వద్ద డబ్బు అడిగేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక యువతి..

స్థానిక బీసీ కాలనికి చెందిన రేణుక (18) కడుపు నొప్పి తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సదరు యువతి తరుచూ కడుపు నొప్పితో బాధ పడుతుండేది. నెల క్రితం ఆమెకు అరికెర గ్రామానికి చెందిన యువకుడితో వివాహం చేశారు. ఈ క్రమంలో హొళగుందలోని పుట్టింటికి వచ్చిన రేణుక బుధవారం నొప్పి తీవ్రం కావడంతో బాధ భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.